

రామవరపు వేణుగోపాలరావు

# మెలగలినాగు

బీచ్ దాదాపు నిర్మానుష్యంగా వుంది.

సంజవెలుగులో కెరటాలు కదిలి అంచుని కసురుకుంటున్నాయి. మనుజ సంచారం లేని సముద్రతీరాన డాక్టర్ జయరామ్ ఒక్కడే వున్నాడు. అతని చేతిలో చిన్న తోలుపెట్టెవుంది. అందులో సజీవంగా వున్న రెండు ఎండ్రకాయలు_ కప్పలు_ఓ తొండా వున్నాయి. డాక్టర్ జయరామ్ బయాలజిస్టు. జీవశాస్త్రం అతని అభిమాన విషయం.

'డాక్టర్ జయరామ్ మా బయాలజీ ప్రొఫెసర్!' అంటారు అతని స్టూడెంట్లు.

అతను మాత్రం 'నే నింకా బయాలజీ స్టూడెంటునే!' అంటాడు వినయంగా.

మానవ ప్రవృత్తులు ఎలా అశేషమైనవో_ఇతర జీవరాసుల మనోవికారాలూ అంత అశేషమైనవీ_విశేషమైనవీ అంటాడతను. బీచ్ ఒడ్డున అతనికో చిన్న లేబరేటరీ వుంది. అదే అతని ఇల్లుకూడా. పగలల్లా క్లాసుల్లో లెక్చర్లిచ్చి రాత్రి కాగానే తన పరిశోధనలు ప్రారంభిస్తాడు. ఒకో అప్పుడు ఆ పరిశోధనకి అంతే వుండదు. అందులో మునిగేడంటే సెకన్లకీ గంటలకీ భేదాలు మర్చిపోతాడు. ఏ రాత్రికో మరీ బడలికగావుంటే పక్క_నేవున్న గదిలోకి వెళ్ళి మేను వాలుస్తాడు. బయాలజీ అతని లోకం, సర్వస్వం లోకంలోకూడా బయాలజీ తప్ప అతని మనసుకి సన్నిహితమైన విషయాలేమీ లేవు. వ్యక్తులూ లేరు. అతను ఏకాకి. కాని అతని లాబ్‌లో అతని చుట్టూ ఎన్నో జీవరాసులు. (ఆ విధంగా అతను ఏకాకి కానేకాడు )

కాసేపయేక ఇంటిమొహం పట్టేడు డాక్టర్ జయరామ్. లేబ్ తలుపు తెరిచి లోపలికి అడుగెట్టేడు. స్విచ్ వేయగానే గదిలోని అంధకారాన్ని విద్యుత్తు తరిమేసింది. చప్పుడు కాగానే తీగెల బోనులో వున్న ఎలకలు ఓసారి అటూ ఇటూ కదిలి చిన్న హడావుడి చేసేయి. తీగెల వలలోని ఆడవిపిల్లులు పాలకోసం కాబోలు మ్యాఁవ్ మ్యాఁవ్ మన్నాయి. డిసెక్షన్ టేబిలుమీది లైటు వెలిగించి చేతిలోని తోలుపెట్టె నేలమీద పెట్టేడు. కిటికీ దగ్గరగావున్న అద్దాల బీరువావేపు వెళ్ళి ఒంగిచూసేడు. చుట్టలు చుట్టుకుని పడుకుని వున్న పాములు అందులో నాలుగున్నాయి. జయరామ్‌ని చూసి కొద్దిగా తలలెత్తి నాలుకల్ని కిందికీ పైకీ ఆడించేయి. తలలు స్పష్టంగా విప్పి వున్నాయి. కళ్లు మట్టికొట్టుకుని పోయినట్టున్నా_అవి తీక్షణంగా జయ

రామ్‌ని చూసేయి. అద్దాల బీరువామీద చెయ్యి వెయ్యగానే అవి అటు తిరిగేయి. చివర్లు నల్లగా మధ్యభాగం కాస్త ఎఱ్ఱగావున్న నాలికల్ని మరింతజోరుగా అటూ ఇటూ ఆడించసాగేయి. గదిలోని మనిషిని గుర్తించినట్టు సూచనగా హఠాత్తుగా నాలుకలు ఆడించడం మాని మూలకి ముడుచుకున్నాయి.

జయరామ్ తను తొడుక్కున్న కోటు విప్పి–నెక్‌టైని వదులుచేసుకున్నాడు. ఓ మూల టేబిలుమీదున్న స్టవ్ వెలిగించి నీళ్ళతోవున్న కెటిల్ పెట్టేడు.

గడియారం ఏడు గంటలు కొట్టింది.

కిటికీలోంచి సముద్రపుగాలి చల్లగా వీస్తోంది.

నీటిమీద వున్న ఓడ ఈదుతోన్న దీపాల మేడలావుంది.

చిన్న రొదచేస్తూ ఆకాశంలో ఏదో విమానం ఎగుర్తోంది.

ఏరాడ కొండమీది లైటుహౌసు రాక్షసి కన్ను గిరగిరా తిరుగుతూవుంది. వుస్సురుమని నిట్టూర్చి కుర్చీలో కూల బడ్డాడు జయరామ్.

...అంటే ఈ రోజు–1968 సంవత్స రంలో ఫిబ్రవరి నెలలో ఏడోరోజన్న మాట; అంటే మరో అయిదుగంటల్లో– డాక్టర్ జయరామ్‌కి 38 ఏళ్లు నిండుతాయి. ఆ సంగతి స్ఫురణకు రాగానే జయ రామ్ నేత్రాల్లో చిన్న వెలుగు వెలిగింది. ఆ వెలుగు బుగ్గలమీదికి ప్రాకింది; అంతలోనే కొడిగట్టిన దీపంలా ఆ వెలుగు అంతరించింది.

'ఏళ్లు నిండుతూనే వుంటాయి. తెల్ల వార్తూనే వుంటుంది. వెలుగు వస్తూనే వుంటుంది. మళ్ళీ వెలుగుపోయి చీకటి వస్తుంది. ఆకాశంలో తారలు...నక్ష త్రాలు...వస్తాయి. పదిహేనురోజులకో సారి పున్నమీ–అమావాస్యా వస్తాయి. హార్బర్లోకి రొదచేస్తూ షిప్పులు వస్తూ వుంటాయి. పోతూ వుంటాయి. స్టేష న్లోకి ట్రెయిన్స్ వస్తాయి. మళ్ళీ కదు ల్తాయి. ఏరోడ్రోంలో విమానాలు దిగుతూ వుంటాయి. ఎగిరిపోతూ వుంటాయి. ప్రకృతి సమస్తం చలిస్తూ వుంటుంది. మారుతూ వుంటుంది. కదుల్తూ వుంటుంది. కదిలిస్తూవుంటుంది. ప్రతిచోటా మార్పు వుంది. మార్పులేని దెక్కడా లేదు. ప్రతిచోటా–చలనం వుంది. సంచలనం వుంది...కాని–కాని–' అనుకుంటూ అద్దంలోని తన ప్రతి బింబం వంక చూసుకున్నాడు జయరాం.

"...నాలోనే మార్పు లేదు. పొద యాన్నే లేవడం. కాలకృత్యాలు తీర్చుకో వడం; నంబర్ టెన్ బస్సెక్కడం. దార్లో పూర్ణామార్కెట్. కె. జి. హెచ్. రామకృష్ణామిషన్. బీచ్, పగోడా. నీలం రంగు ఆకాశం మబ్బులు. నాచురంగు సముద్రం. రోడ్డుపక్క–చెట్లు. పెద్ద పెద్ద మేడలు. చిన్నచిన్న గుడిసెలు. మామూలు పెంకుటిళ్ళు...ఇవి రోజూ

చూసే మామూలు దృశ్యాలే! స్టూడెంట్స్‌కి లెక్చర్లివ్వడం. మధ్యాహ్నం లంచ్. కాసేపు ఏదో చదువు. మళ్ళీ బేక్ టు హోమ్-కమ్-లాబ్! జీవరాసుల్తో పరిశోధన. తినడానికి నోరుండి-అడగడానికి నోరులేని జీవరాసుల సహవాసం!- ఇదంతా మామూలే! రాత్రి ఏ తొమ్మిది గంటలకో చల్లారిన కేరియర్ భోజనం. ఆనక లాబ్ పక్కనున్న గదిలో నిద్ర ..మళ్ళీ తెల్లారేక- అంతే! అవును మార్పులేనిది నాలోనే అవునవును. నాలోనే!" అనుకుంటూ నిట్టూర్చి కుర్చీలో వెనక్కి వాలేడు డాక్టర్ జయరామ్. పేకెట్లోంచి సిగరెట్ తీసి వెలిగించేడు. గుప్పుమని పొగ వదుల్తూ పాములున్న అద్దాలబీరువాని చూసేడు 'క్రేట్' సున్నా ఆకారంలో చుట్టలు చుట్టుకుని పడుకుంది. 'వైపర్' కూడా మరో మూల ముడుచుకునివుంది "రేటిల్ స్నేక్" మాత్రం పాదరసంలా జారుతూ అటూ ఇటూ కదుల్తూంది కోబ్రా మాత్రం పడగవిప్పి కూర్చుంది నల్లటి చివరున్న నాలుకని మాటిమాటికీ ఆడిస్తూ జయరామ్‌ని చూస్తోంది. వుండి వుండి నోరు చిన్నగా తెరుస్తోంది. బీరువా అద్దాల్ని నాలుక స్పర్శిస్తోంది. నిమిషానికోసారి బుస్సుమంటోంది

స్టౌ మీద కెటిల్లో నీళ్ళు మరుగుతున్న చప్పుడు .

నాగుపాము బుసకొడ్తూన్న ధ్వని...

తీగెలవలలో అడవిపిల్లుల మ్యావ్ మ్యావ్‌లు...

బోనులో ఎలకల కిచకిచలు...

ఆక్వేరియంలో ఈదుతోన్న 'జెల్లీ ఫిష్ తోకతాకిడికి నీట్లోంచి లేస్తూన్న శబ్దతరంగాలు.

ఇవన్నీ తెలిపేదేమిటి?

సాలోచనగా-దాదాపు శూన్యంలోకి చూస్తున్నట్టు వాటిని చూసేడు జయరామ్.

ఆకలి సమస్త జీవరాసుల్లోనూవుండే సామాన్య లక్షణం అసామాన్య కార్యాలకి కూడా ప్రేరికొల్పే సహజమైన కోరిక. ఆకలిలేని జీవం లేదు. ఆకలి పిపీలికానికి వుంది. మశకానికీ వుంది హస్తికి వుంది క్రిమికి వుంది కీటకానికి వుంది. పశువుకి వుంది. పక్షికి వుంది. మనిషికూడావుంది...సమస్త జీవరాసుల్లోనూ ఒక్క ఆకలేనావుంది...మరింకేమీ లేదా? మరే లక్షణాలూ లేవా! జాలి-కరుణ-కోపం - హింస-విరాగం - తాప...

అన్నట్టు...ప్రేమ...ఆ - ప్రేమ. ఇవన్నీ వున్నాయే!

ఆవు దూడని నాకుతూ పాలిస్తుంది.

కాకి పిల్లకి ముక్కుతో ఆహారం పెడుతుంది.

తల్లి బిడ్డకి స్తన్యం ఇడుపుతుంది. అంతేకాదు -

మగకాకీ ఆడకాకీ సరసాలాడుకుంటాయి.

అబోతు అవుని మరులు కొలుపుతుంది.

ప్రియుడు ప్రేయసిని లాలిస్తాడు.

అద్దాలబీరువాలోని నాగుపాము బుస్సుమంటూ అద్దాన్ని ముద్దుపెట్టుకుంది. జయరామ్ ఆలోచనాస్రవంతికి ఆనకట్ట పడింది. లేచి అద్దాల బీరువాని సమీపించి నాగుపాముకి సౌంజ్ఞ చేసేడు. సాధారణంగా దాని అర్థం - "గోల చేయక పడుకో" అని. కాని నాగుపాము అలా చెయ్యలేదు సరేకదా - తలెత్తి మరింత ముందుకి వంగింది. మరింత జోరుగా నాలుక ఆడించడం ప్రారంభించింది. విసుగ్గా టేబిలు మీదున్న స్టవ్ దగ్గరికి నడిచేడు జయరామ్. మరుగుతూన్న నీళ్ళలో టీ గుండ వేసేడు. కాసేపు మరిగేక కిందకి దించి డికాషన్‌లో నాలుగు నీళ్ళ చుక్కలు వేసేడు. నలుపలకలుగా వున్న స్టీలు గిన్నెలోకి డికాషన్ దించి దాంట్లో పాలూ పంచదారా వేసి స్పూన్‌తో కలిపేడు. వెచ్చటి - తియ్యటి - మత్తుగావుండే టీ వాసన అతని నాసాపుటాల్లోకి వెళ్ళింది. ఓ పక్కనున్న గ్లాసుతో కొంత ఒంపుకొని మిగతా టీ ఫ్లాస్క్‌లో పోసేడు. ఫ్లాస్కు మూత పెట్టి గోడకి తగిలించేడు. టీ గ్లాసు చేత్తో పట్టుకుని కుర్చీవేపు నడిచేడు. కూర్చున్నాక గ్లాసు అంచుల్ని పెదాల దగ్గరకి తీసుకురాబోయి ఆగిపోయేడు.

ఆక్వేరియంలోని చేపలు తలలెత్తి ఆహారం కోసం వుండుండి నోళ్లు తెరుస్తున్నాయి. అడవి పిల్లులు దీనంగా మ్యాఁవ్ మ్యాఁవ్ మంటున్నాయి. ఎలుకలు కళ్ళల్లో ఆత్రుతత నింపుకుని బోను తీగెలమీద ముంగాళ్ళు అనించి మిడుతూ మిడుతూ చూస్తున్నాయి. అద్దాల బీరువాలోని నాగుపాము తన శరీరంలో సగభాగాన్ని 'S' ఆకారంలో వంచి బుస్సుమంటోంది.

ఆ జీవరాసుల కళ్ళలో ఆకలే కాదు. కోపం, ద్వేషంకూడా వున్నాయి. అదంతా చూసేక జయరామ్ పెదాల మీద చిన్న హాసరేఖ వుదయించింది. అది ప్వకాదు అభయం. శాంతించండి. అనే సందేశం! గ్లాసులోని టీ కాస్త తాగి ఒక్కసారి వెగటుగా ముఖం చిట్లించేడు 'అబ్బ, చేదు విషం!' అనుకున్నాడు.


'పంచదార వేసేదా?'

జయరామ్ గతుక్కుమన్నాడు. ఎవరిదీ మధురకంఠం? మూగజీవుల ఆకలి కేకలు తప్ప మానవమాత్రుల కంఠధ్వని వినరాని - ఈ గదిలో ఎవరి దా గొంతు?

ఎదురుగా గోడమీద నాగేశ్వరి ఛాయాచిత్రం నవ్వుతూ కన్పించింది.

అద్దాల బీరువాలో ఆకలిచల్లారని నాగుపాము బుస్సు మంటూంది.

జయరామ్ చేతిలోవున్న గ్లాసులోని వెచ్చని చేదైన టీ వేడివేడి ఆవిర్లు విర




జిమ్ముతోంది. నాగేశ్వరి ఫోటోని
చూస్తూ నిర్ఘాంతపోయేడు జయరామ్...
సరిగ్గా అయిదేళ్ళ కిందట ఇదే ప్రశ్న
వేసింది నాగేశ్వరి. అదే ప్రశ్న వేసి
చేదుగా వున్న టీవి తియ్యగా మార్చింది.
అంతటితో అలా ఆగిపోతే బాగుండును.
కాని అలా ఆగలేదు. ఆ సంఘటనే ఆ
తర్వాత అతని తియ్యటి జీవితాన్ని
చేదుమాత్రగా మార్చింది. ఆ తియ్యటి
ప్రశ్న ఎంత విషం విరజిమ్మింది.

'పంచదార వేసేదా?'

ఎవరూ వెయ్యని ప్రశ్నను విని,
కళ్ళు నులుముకుని మరోసారి నాగేశ్వరి
ఫోటోని చూసేడు డాక్టరు జయరామ్.

అయిదేళ్ళ కిందట...

* * *

బొంబాయిలో జరుగనున్న 'అఖిల
భారత జీవశాస్త్రజ్ఞుల సదస్సు'లో డాక్టర్
జయరామ్ ఓ ముఖ్యవక్తగా ఎన్నిక
య్యేరు. ప్రపంచంలోని ఎన్నో జీవరా
సుల తత్వాల్ని బుర్రలో ఇముడ్చుకున్న
జయరామ్ కాళ్లు అంతవరకూ బొంబాయి
రోడ్లమీద నిలబడి ఎరగవు. బొంబాయి
లోని ఒక కాలేజీలో లెక్చరర్‌గా
వుంటూన్న సుబ్రహ్మణ్యం ఒకానొక
ప్పుడు అతని స్టూడెంటే! తనిలా ఫలానా
పనిమీద బొంబాయి వస్తున్నట్టు అతనికి
వుత్తరం రాసేడు. వారంరోజులు గడి
చినా సమాధానం రాలేదు...సెమినార్‌కి
వ్యవధిగూడా ఆట్టేలేదు. ఏదైతే అద
యిందని బొంబాయి బయల్దేరేడు జయ
రామ్... విక్టోరియా టెర్మినస్‌లో

ట్రెయిన్ ఆగగానే సూట్‌కేస్ పట్టుకుని గుమ్మంలో నిలబడ్డ జయరామ్‌కి ఎదురుగా ప్లాటుఫామ్‌మీదనిలబడ్డ ఓ యువతి కన్పించింది. కళ్ళకి కూలింగ్ గ్లాసెస్. పేరు తెలీని ఏదో హెయిర్‌స్టయిల్. రంగురాసుకున్నా రాయనట్టున్న పెదాలు. ముగ్ధత్వం తెలియజేసే బుగ్గలమీది లేత గులాబీరంగు. తీర్చిదిద్దిన కనుబొమలు. బిస్కెట్‌రంగు టెర్లిన్ చీరా – అదే రంగు జాకెట్టూ ధరించిన ఆ యువతిని తప్పని సరై మరోసారి చూసి – బలవంతంగా ముఖం తిప్పుకొని ప్లాట్‌ఫామ్ మీదికి దిగేడు. ఆ యువతి చరచరా జయరామ్‌ని సమీపించింది. మొగలిసెంటు వాసన గుప్పుమంది. ఆమెని ప్రశ్నార్థకంగా చూసేడు.

"మీరేనా డాక్టర్ జయరామ్?"

స్వచ్ఛమైన తెలుగులో వినవచ్చిన ప్రశ్నకి జయరామ్ చెవులు సిద్ధంగా లేవు... కాస్త తడబడ్డాడు.

"నేనే...! మీ కెలా తెలుసు?"

ఆమె నవ్వుతూ కూలింగ్ గ్లాసెస్ తీసింది. కంపార్టుమెంట్‌కి అంటించి వున్న రిజర్వేషన్‌స్లిప్ వంకచూసింది. జయరామ్‌కి సంగతి అర్థమైంది.

"సుబ్రహ్మణ్యం మా అన్నయ్య. కాలేజీకి శెలవులుగా. అంచేత మద్రాస్ వెళ్ళేడు. ఆ తర్వాతే మీ వుత్తరం అందింది..." అంది తన రాకకి సంజాయిషీ చెప్పుకుంటూన్న ధోరణిలో.

"ఓహో...సారీ..."

"మరేం ఫర్వాలేదు. మా అన్నయ్య లేకపోయినా... నే వున్నాగా. మీరు మా గెస్ట్ అవక తప్పదు. లేకపోతే మా సుబ్బూ నన్నెంతో కోప్పడ్తాడు..."

ఏమనాలో జయరామ్‌కి పాలుపోలేదు.

"మీ—మీపేరు?"

'మిస్. నాగేశ్వరి."

మంత్రించిన సర్పంలా ఆమెని అనుసరించేడు జయరామ్.

మర్నాడు...సాయంకాలం...


"అబ్బ" అంటూ చేతిలోని కప్పుని టేబిలుమీద పెట్టేడు జయరామ్.

"పంచదార వేసేదా?"

తలెత్తిచూసేడు. ఓచేతిలో పంచదార టిన్నూ మరోచేతిలో తళతళ మెరుస్తోన్న స్పూన్. మరికాస్త తలెత్తేడు నిగనిగ లాడుతున్నకురులు. పసిడిరంగు మేను. తేనెలో ముంచినట్టు తడిగావున్న పెదాలు నీలపురూ నలుపూకాక మధ్యస్థంగావుండే రంగున్న కంటిపాపలు. కళ్ళమీదకి – బుగ్గలమీదకి – పెదాలమీదికి – నాసికమీదకి – ఒక్కసారి జర జరమని పాదరసంలా ప్రవహించే హాసరేఖ. అందులోని ఇంద్రచాపం ... మహేంద్ర జాలంలో మునిగినట్టయింది జయరామ్‌కి.

"పంచదార వేసేదా?" అంది నాగేశ్వరి మళ్ళీ, నవ్వుతూ!

ఎండిపోయిన గొంతుకని అతి కష్టం




మీద అదుపులోకి తెచ్చుకొని 'వూఁ' అనగలిగేడు జయరామ్.

"మీకు టీలో ఎక్కువ పంచదార కావాలనుకుంటాను..." అంటూ ఓ చెంచాడు పంచదార టీలోవేసి కలిపింది.

కాసేపొయ్యేక —

"జూహూ బీచ్ బావుంటుంది. చూస్తారా?" అంది.

"ఊఁ" అన్నాడు.

కారెక్కేరు. స్టీరింగ్ దగ్గర నాగేశ్వరి కూర్చుంది. లేత బిస్కెట్ రంగులోని టెర్లిన్ చీర ఆమె ఒంటిమీద వూగాడుతోంది. గుండ్రటి బుజాలమీద అదేరంగు జాకెట్టు అతుక్కుని పోయి వుంది. ఈసారి వాలుజడ వేసుకుంది. జడకి మొగలిపూలు కుట్టింది. మొగలిసెంటు గుబాళిస్తోంది. సభ్యతగా వుండదనే సందేహం జయరామ్‌లో లేకపోతే — ఆమెని నమిలి మింగేసేలా చూసేవాడే! కళ్ళుదించి ఓరగా ఆమె నడుంవేపు చూసేడు. చీరకీ జాకెట్టుకీ మధ్యనున్న బెత్తెడుజాగా ఆతనిదృష్టిని ఆకర్షించింది. పొట్టదగ్గర శరీరం అందంగా చిన్న మడతపడింది. ఆమె ముందుకి వొంగు

తూన్నపుడల్లా ఆ మడత మరింత అందంగా పెద్దదవుతోంది. ఆమె ఒంటి రంగు యేదో అతనింకా నిర్ధారణ చేసుకో లేదు. అది పాలతెలుపూ కాదు. ఎర్రటి ఎరుపూ కాదు. అదేదోరంగు. అతి అంద మైన రంగు...ఒక్కసారిగా కారాగటం వల్ల ఆ కుదుపుకి పక్కకి వాలేడు జయ రామ్ ఆ వాలడంలో ఆమె భుజానికి అతనిభుజం రాసుకుంది. ఊహించని ఆ స్పర్శకి ఆమె తలతిప్పి జయరామ్‌ని చూసింది. ఆ తొందరలో పాము కుబుసం లాంటి తెల్లనిచీర భుజంమీంచి కిందికి జారింది అనుకోకుండా జయరామ్ దృష్టి ఆమె వున్నత వక్షస్థలంమీద పడింది అతని రక్తనాళాల్లో ఒక్కసారి కోటి సముద్రాలు పురకలువేసేయి. 'ఈ క్షణం ఇలా నిల్చిపోతే బాగుణ్ణు' అను కున్నాడు జయరాం. కాని ఆక్షణం అలా నిల్చిపోలేదు. ఆ దేకాదు ఏక్షణమూ అలా అవలేదు. ఎన్నో క్షణాలు శర వేగంగా దొర్లిపోయేయి ... ఇద్దరూ బీచ్‌లో కూర్చుని సాగరఘోష వినసా గేరు. ఎన్నోకబుర్లు చెప్పుకున్నారు. ఎన్నో విశేషాలు కలబోసుకున్నారు. ఒకరిగురించి ఒకరు తెలుసుకున్నారు. ఒకరినొకరు ఆశించేరు. ఒకరికోసం ఒకరు ఆరాటపడ్డారు. ఒకరినొకరు కాంక్షించేరు. ఆమె సాహచర్యం కోరే డతను, అతని సాహచర్యం కోరిందామె. అదేవారి తొలిప్రేమ ఘట్టం. వారి వైవా హిక జీవితానికి నాంది!

మరి కొన్నాళ్ళకి —

డాక్టర్ జయరామ్ - మిస్ నాగేశ్వరి ఓ శుభముహూర్తాన దంపతులయ్యేరు. ఎన్నో బొద్దింకల్నీ — ఎలకల్నీ - కప్పల్నీ - పాముల్నీ డిసెక్ట్‌చేసిన జయ రామ్ చేతులు సన్నని ఆమెనడుం చుట్టేయి. ఆచేతివేళ్ళు ఆమె ఒంటిని వీణ మీటినట్టు మీటేయి. కూచిపూడి - కథక్ - మణిపురి - భరతనాట్యాలు అవలీలగా అభ్యసించిన ఆమె తన శరీరాన్ని, అతని సుఖాలకి అనువుగా మలుచుకుంది... అలా కాలగర్భంలో ఎన్నో మిలియన్ల క్షణాలు ఓ ఏడాదిగా మారేయి...

ఓనాడు —

"ఏమండీ, మీరీ పాడుపన్లు మానెయ్య కూడదూ?"

"ఏ పాడుపన్లు?''

"అదేనండీ, మహానుభావా! మీ బయాలజీ ప్రొఫెసర్ వుద్యోగం ...''
అంది గలగలా నవ్వుతూ.

"అది పాడుపనా?''

"కాదనుకోండి. కాని ఈ బల్లులూ - నల్లులూ మీరు చంపుతూండడం నేను సహించలేను..."

"మరి డబ్బో!''

"డబ్బుకేం కొదవ? నేనో డాన్స్ ప్రోగ్రామ్ ఇచ్చేసనంటే వేలు కురు స్తాయి..."

"— నిజమే ననుకో!"



''ఆడదాని సంపాదన తినడమా – అని సందేహమా ?''

"నాకా సందేహం లేదుసుమా. అటువంటి పట్టింపులు నాకులేవు. నాడబ్బు నువ్విప్పుడు తింటున్నావుగా. నేన్నీడబ్బు తింటే తప్పేముంది ? అదికాదు..."

''మరేది ?''

"నేను చాలా కష్టపడి చదువుకున్నాను. డబ్బు చాలకపోతే పస్తులుండి మాఅమ్మ నాజీతంకట్టేది. పుస్తకాలు కొనేది. నాకోసం ఆమెచేసిన త్యాగాలు నేను మర్చిపోలేను. విజ్ఞానమే ధ్యేయంగా పెట్టుకుని శ్రమించేను. ఈనాటికి ఇప్పుడు డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎంటొమోలజీకి హెడ్‌నయ్యేను. అప్పటికీ నేను సాధించవలసిందింకా ఎంతోవుంది. నా ఆశయం అల్లా ఒక్కటే ! విషజంతువుల మీద ఇంకా రిసెర్చి చెయ్యాలి. ఏనాటికైనా – నేను వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్‌కి ఎక్స్‌పర్ట్ ఎడ్వయిజరీ పేనల్ మెంబర్ని అవ్వాలి. అదే నాగమ్యం ! ఈవిషయంలో నేను ఏనాటికైనా పూర్తి విజయం సాధిస్తానన్న నమ్మకం నాకుంది..."

"అంటే – నామీద మీప్రేమ యింతేనన్నమాట ?"

"ఛ... ఛ... ఎందుకలా అనుకుంటావ్ ? పుట్టిన ప్రతిమనిషీ గిట్టక

తప్పదు. బతుకులో సాధారణంగా ఎవరూ సాధించేదేమీ వుండదు. కాని నాబతుకులా సాధారణమైనది కాకూడ దని నాకోరిక విషజంతువులపై ప్రయోగాలు చేస్తాను. నేననుకున్న ప్రమాణాలు సాధిస్తాను. అప్పుడు ఎవరీమనిషి – అని ప్రపంచ ప్రజలందరూ నాకేసి విస్తుపోయి చూస్తారు. ఆ – నేను – నీభర్తని కావడం నీకు గర్వకారణం కాదూ ?''

"ఎందుక్కాదూ? కాని–మీకులాగేనాకూ కీర్తికాంక్ష వుంది. ఎన్నో సంవత్సరాలు శ్రమపడి నాట్యం నేర్చుకున్నాను. నా నాట్యాన్ని జనం మంత్రముగ్ధులై చూస్తారు. కనకవర్షం కురిపిస్తారు. ఫలానా నర్తకి మీభార్యే అని అనుకుం టారు. జెలసీ ఫీలవుతారు. అది మీకు ఆనందం కాదూ ?"

"తప్పకుండా నాకానందమే! కాని నాది కీర్తికాంక్ష అన్నావు. కాదు. అది పొరబాటు. నాకేనాడు కీర్తి మీద వ్యామోహంలేదు ... నేను రిసెర్చ్ చేయగా సాధించిన ఫలితాలు మానవజాతి మనుగడకి ఎంతో వుపకరిస్తాయి... నా క్కావాల్సిందదే !''

"పోనీ మీమాటే రైటు. మీరు ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. నేను నర్తకిని. అయినా పెళ్ళయ్యేక నాలో రగుల్తోన్న కళారాధనని ఆర్పేసేను. సెంట్ పెర్సెంట్ హిందూగృహిణిగా – ఎవరో అన్నట్టు–వంటింటి మహాలక్ష్మిలా మారేనే అనుకోండి ....''

''– వూఁ – అనుకున్నాను... ''

''నాభర్త ప్రేమానురాగాలనన్నీ కొల్లగొట్టి... తనివితీరా అనుభవించాలనీ – అనుక్షణం అతనికి చేరువగా వుండాలనీ స్త్రీ సహజమైన కోర్కెలు నాకున్నాయంటారా లేదా ?''

"ఎందుకుండవూ ? వుంటాయి...!"

''ఆ కనీసపు కోర్కెలు తీర్చే ధర్మం మీకుందంటారా ?''

''వుంది''

''మరైతే – అలాంటప్పుడు ఎంచక్కా పగలు మీ పనయ్యేక – చక్కా నాదగ్గరికి రావచ్చుగా. నాతో గడపొచ్చుగా. మళ్ళీ సాయంకాలం అయ్యేటప్పటికి లాబ్ లో దూరి – ఆ పిల్లుల్తో, పాముల్తో మీరు వెలిగించే రాచకార్యం...''

''నాగూ !'' గట్టిగా అరిచేడు జయరామ్.

''మీరు నాభర్త. మిమ్మల్నే నేను ఆరాధిస్తున్నాను. మీప్రాణం నాకెంతో అమూల్యమైంది. అంతటి అమూల్యమైన వస్తువుని నేను దూరం చేసుకోలేను. అది విషసర్పాల్తో చెలగాటాలాడ్డం నేను సహించలేను... అంతేగాదు, మీ సముఖంలోనే విరహాన్ని నేను భరించలేను బీచ్ షికార్లువద్దు, పార్టీలూ వద్దూ. ఆడంబరాలు అంతకన్నా అవసరంలేదు. నగలూవద్దు నాట్యాలూ వద్దు. నాక్కావల్సిందల్లా మీసాన్నిధ్యం. కేవలం అదే!''




నిశ్చేష్టుడై నిలబడిపోయేడు జయరామ్.

చీకట్లు ముసురుకొన్న మెదడులో ఎవరో హఠాత్తుగా టార్చ్‌లైట్ వేసి నట్టయింది...!

నాగేశ్వరి అంతరంగం అతనికిప్పుడు స్పష్టంగా అర్థమైంది. ఆమె మాటల్లో బేలతనం వుంది. అనురాగం వుంది. మూర్ఖత్వం వుంది. సుఖలాలసా వుంది. కార్య కారణాలున్నాయి. దానికి తను కోప్పడవలసిందీ - గద్దించవలసిందీ - బుజ్జగించవలసిందీ - ఖండించవలసిందీ - ఏమీలేదు.

ఒక వివాహితగా - స్త్రీగా - అన్నింటినీ మించి మనిషిగా ఆమె తననో ప్రశ్న వేసింది. తను చెయ్యవలసిందల్లా ఆ ప్రశ్నకి సమాధానం చెప్పడం. ఏం చెప్తాడు తను ?

ఆనాడు నీళ్ళబిందెలు మోస్తూ నాగుపాము కాటుకి గురై నిమిషాలమీద చనిపోయిన కన్నతల్లి పేలవమైన ముఖం తనకేం చెప్పింది. లక్షలకొద్దీ పేజీలున్న గ్రంథాలు తనకేం చెప్పేయి ? ఏళ్ళ పరిశోధనలు...పదిహేనేళ్ళ పాతదైన మైక్రోస్కోపు......రకరకాల జీవరాసులు...తనకేం చెప్పేయి ?

విజ్ఞానం అశేషం ! అనంతం !

దాన్ని మథించడమే తన గమ్యం !

వివాహం దానికి - తన లక్ష్యానికి ఆటంకమా ?

ఇన్నాళ్ళుగా పరిశోధనలు సాగించి- ఈనాడు - స్త్రీమీది మోహంతో - గమ్యాన్ని ఎలా పక్కకి నెట్టెయ్యడం? ప్రపంచానికి మహోపకారంచేసే పరిశోధనా ఫలితాలివ్వవలసినశక్తి - స్త్రీ అంద చందాల ఆరాధనలో నీరుకారిపోవటం సహజంగావుందా ? 'మరైతే ఆమెని ఎందుకు వివాహం చేసుకున్నావ్ ?' అంది హఠాత్తుగా అద్దంలోని జయరామ్ ప్రతిబింబం. జయరామ్ కాస్త తడబడ్డాడు. 'ఆమె అందం చూసేను. మోహించేను నాకు సహచరి కాగలదనీ - నా పరిశోధనల్లో ప్రముఖపాత్ర వహించి సహకరిస్తుందనీ వివాహం చేసుకున్నాను...' అని తనని తాను సమాధానపరుచుకోడానికిప్రయత్నించేడు.

"క్షమించు నాగూ, నీ వుద్దేశ్యం నాకు అర్థమైంది నీ అందం - నీ సహృదయత నన్ను ముగ్ధుణ్ణిచేసేయి. నీ సాహచర్యం కావాలని నాకు బలంగా అన్పించింది నేను నిన్నెంతగా ప్రేమిస్తున్నానో మాటల్లో చెప్పలేను. నాప్రేమని ప్రూవ్ చేయమన్నా చేయలేనేమో. నా కోరిక మన్నించి - నా గమ్యం నేను చేరడానికి సహకరించు నీకోరికనితీర్చలేకపోతున్నందుకు మన్నించు. జీవశాస్త్ర పరిశోధనే నా లక్ష్యం. ఆ లక్ష్యం నేను చేరడానికి నువ్వు దోహదంచెయ్యి..." అన్నాడు జయరామ్ చాలా సేపటికి.

వెంటనే నాగేశ్వరి ఏ మాటా అనలేదు. విశ్చేష్టురాలై జయరామ్ నేచూస్తూ నిలబడిపోయింది. కాసేపటికి తల కిందికి దించుకుంది. దించుకున్న కళ్ళనుంచి కన్నీరు కారి ఆమె వక్షస్థలంమీద పడడం జయరామ్ గమనించకపోలేదు.

పాము కుబుసం విడిచేముందు... దాని కళ్ళనుంచి పాలకన్నీరు వెలువడ్తుందన్నసంగతి ఎందుకోగాని జయరామ్‌కి ఆ క్షణంలో గుర్తుకి వచ్చింది..!

కొన్ని క్షణాలు పోయేక తలెత్తి సూటిగా జయరామ్ కళ్ళలోకి చూసింది నాగేశ్వరి. ఆమె కళ్ళు దెబ్బతిన్న నాగుపాము కళ్ళలా వున్నాయి.

"ఎర్రగా బుర్రగా వుంటే ఏమో అనుకున్నాను చదువూ అందం వుద్యోగం హోదా చూసి మురిసిపోయేను సహృదయతకీ అనురాగానికీ లోటా అనుకున్నాను. ఇప్పుడు తెలిసింది. అవన్నీ ఎండమావులు. ప్రపంచంలోవుండే మగాళ్ళల్లో మీరేమీ పెద్ద ఎక్సెప్షన్ కాదు మీ మగాళ్ళంతా యింతే! కేవలం స్వార్థపరులు. మీకు నేనేమీ కాను. పేరుకే పెళ్ళాన్ని. మీ ఉద్యోగం - హోదా - పరిశోధనలే మీకు లోకం. తిండి వండి పడెయ్యడానికీ - కావలసినపుడు ఒళ్ళప్పగించడానికీ తప్ప మీకు భార్య అవసరం ఏముంది ?" అంటూ నాగేశ్వరి టేబిలు మీదున్న ట్రాన్సిస్టర్ రేడియో అందుకుని విసవిసా డాబామెట్లెక్కి వెళ్ళిపోయింది.



నుదుటిమీది స్వేదబిందువుల్ని రుమాల్తో తుడుచుకుని – లాబ్ వేపు నడిచేడు జయరామ్...!

ఇది జరిగిన కొన్నాళ్ళకే – యూనివర్సిటీనుంచి ఇంటికొచ్చిన జయరామ్‌కి మానవ సంచారంలేని ఇల్లు బావురుమంటూ కన్పించింది. ఇల్లంతా వెదికేడు. గొంతెత్తి పిలిచేడు ప్రతిధ్వని తప్ప సమాధానం రాలేదు. జయరామ్ మనస్సు కీడు శంకించింది... అతను గత సాయంత్రం ఓగోధుమవన్నె త్రాచుపాము తెచ్చేడు. దానికి కోరలింకా తియ్యలేదు. 'వెనమ్'కూడా పిండలేదు. అదిగాని... ఆ ఆలోచన రావడమే తడవుగా గబగబ లాబ్ తలుపుతీసి లోనికివెళ్ళేడు. అద్దాల బీరువాలో అలసిపోయి పడుకున్న త్రాచు చప్పుడుకి ఒక్కసారి తలఎత్తింది. తల నిటారుగాపెట్టి నాలిక ఆడించింది. చిన్నగా బుస్సుమంది. ఆ బీరువామీదే వుంది ఏదో కాగితం! చటుక్కున అందుకుని దాని మడత విప్పేడు. నాగేశ్వరి దస్తూరీ. గబగబ చదివేడు–

'శ్రీవారికి –

మీకు చెప్పే వెళ్దామనుకున్నాను. గాని, మీకు ఎదురుపడే ధైర్యం నాకు లేకపోయింది. నేనెందుకు వెళ్ళిపోతు

న్నానో మీకు వేరే చెప్పడం ఎందుకు? మీరు జీవశాస్త్రంలో నిష్ణాతులు. ప్రపంచంలో నేనూ ఒకజీవినే! మనవి రెండు వేరువేరు ధృవాలు. మనం జీవితంలో ఏదో మిరకిల్ జరుగుతేనే తప్ప కలుసుకోలేం. నా జీవితం ఏమౌతుందో అని మీరు దిగులుపడకండి. నాట్య ప్రదర్శనలవల్ల డబ్బు సంపాదించగలను. సినిమాఛాన్సులుకూడా తగలొచ్చు... రెండూ లేకపోయినా ఫర్వాలేదు. అడది అవినీతిగానేనా డబ్బు అవలీలగా సంపాదించే అవకాశం వుందిగా! మీ సంగతే జాగ్రత్త. మీకు హోటలు భోజనం పడదు. అంచేత ఎవర్నైనా వంటలక్కనో - వంటవాణ్ణో కుదుర్చుకోండి. ఎప్పుడేనా స్త్రీవాంఛ పుడితే దానికికూడా మార్గాలున్నాయి. అయిదో పదో పోతే పోయేయి. అంతేగాని - మళ్ళీ పెళ్ళి మాత్రం చేసుకోకండి! చేసుకుని మరెవ్వరికీ అన్యాయం చెయ్యకండి. ఇంతే! వుంటాను.

—మీ నాగేశ్వరి.'

—చేతిలోని వుత్తరం అప్రయత్నంగా నేలరాలింది. కళ్ళముందు కట్టుకున్న సౌధాలు నేలకూలేయి. కోటికోటి సముద్రాలు అతనిచెవుల్లో వికటాట్టహాసాలు చేసేయి...

'ఎంతపని చేసేవు నాగూ!?' అనుకుంటూ చేతుల్తో ముఖం కప్పుకున్నాడు జయరామ్.

ఆ తర్వాతే నాలుగేళ్ళు శరవేగంతో వెనక్కి వెళ్ళిపోయేయి. అయిదేళ్ళ తర్వాత నాగేశ్వరి స్మృతి ఇంతగా తీవ్రం అవడం ఇదే మొదటిసారి! అద్దాల బీరువాలోని 'మొగలినాగు'ని చూసినప్పుడల్లా జయరామ్‌కి నాగేశ్వరే గుర్తుకి వస్తూంటుంది...

* * *

...జయరామ్ మళ్ళీ లేచి టేబిలు దగ్గరికి వెళ్ళేడు. డబ్బాలోని చక్కెరని స్పూన్‌తో తీసి టీలో కలుపుకున్నాడు. మెల్లిగా సిప్ చేయసాగేడు. టీ తాగడం కాగానే తోలుపెట్టెలో తెచ్చిన చేపల్ని తీసి ఎలకలమధ్య పడేశాడు. అంతవరకూ తీగెలెక్కి దిక్కి చూస్తూన్న ఎలకలు పరుగుపరుగున ఆహారం పడ్డచోటుకి గెంతేయి. గ్లాసులోపాలు పిల్లుల దగ్గరున్న సాసర్లలో పోసేడు. అకల్తో వున్న అడవిపిల్లులు నాలుకలకి హడావుడిగా పని కల్పించేయి. మొగలినాగు మాత్రం ఆ సందడిని శ్రద్ధగా వింటోంది.

అదే సమయంలో తలుపుదగ్గర ఏదో చప్పుడయేసరికి వెనక్కితిరిగి చూసేడు జయరామ్. గుమ్మంలో ఎవరో యువతి నిలబడి వుంది. సన్నంగా పొడవుగావుంది. నిర్లక్ష్యం చేయబడ్డ ముంగురులు అల్లిబిల్లిగా నుదుటిమీద పడ్తున్నాయి. బిస్కెట్‌రంగు సాదాచీరా - అదేరంగు జాకెట్టూ ధరించింది. వెల్తు

రులో ఆమె నల్లటి కనుపాపలు మెరుస్తున్నాయి...

"లోపలకి రావొచ్చా?"

"రండి" అంటూ తలాడించేడు జయరామ్.

ఆమె రెండడుగులు ముందుకువేసింది "మీతో కాస్త మాట్లాడాలి. మీరు-డాక్టర్ జయరామ్, బయాలజీ ప్రొఫెసర్... అవునా?" అంది.

"అవును."

ఆమె మౌనంగా డిసెక్షన్ టేబిలు పక్కనున్న కుర్చీలో కూర్చుంది.

"ఎక్స్యూజ్మీ ... జస్ట్ ఏ మినిట్!" అంటూ జయరామ్ మరికొన్ని చేపల్ని ఎలకలటోనులో వేసేడు. అంతకుముందే ప్రిపేర్ చేసిన 'మిల్కీ ఫ్లూయిడ్'ని మైక్రోస్కోప్లోంచి పరీక్షించడం ప్రారంభించేడు ... పక్కనే వున్న యువతి తన స్టూడెంటేమో గుర్తుకి తెచ్చుకోడానికి ప్రయత్నించేడు ... ఉహూఁ... కాదు. ఎవరో. జయరామ్కి ఇలాంటి పిలవని పేరంటాలంటే మహా చిరాకు. వేళాపాళా లేకుండా రావడం... అడ్డదిడ్డమైన ప్రశ్నలు వేయడం... అతనికి నచ్చదు. కాని ఈవిడెవరో గట్టిదాన్లా వుంది. 'మీతో మాట్లాడాలంటూ' వచ్చి మూగనోము పట్టింది.

"ఒక్కనిముషం... వీటికి రెండు రోజులై ఆహారంవెయ్యలేదు. వేసేక-నేను రెడీ! మీ కిక్కడ వుండడం ఇష్టంలేకపోతే - ఆ పక్కనున్న గదిలో కూర్చోవచ్చు!"

"నో. నో. ఫర్వాలేదు. మీ ఇష్టం వచ్చినంతసేపు కానివ్వండి. మీకు తీరుబడి అయ్యేవరకూ ఇక్కడే వెయిట్ చేస్తాను" అంది, 'ఇక్కడే' అన్న పదాన్ని నొక్కిపలుకుతూ. ఆమె చూపులు పరిసరాల్ని పరీక్షిస్తున్నాయి. ముఖం పేలవంగా నిర్జీవంగావున్నా ఏదో చెప్పలేని ఆకర్షణకూడా వుంది-అందులో. ఆ కళ్ళల్లో అలసటలేని అన్వేషణ.... మొండి పట్టుదలా వున్నాయి.

ఆమెనుంచి అటువంటి సమాధానాన్ని జయరామ్ ఆశించలేదు. ఆ మాటలు ఆధారంగా ఆమె స్వభావ స్వరూపాలు అంచనా వెయ్యటానికి ప్రయత్నించేడు. ఎందుచేతో ఆమెకి ఓ చిన్న 'షాక్'లాంటిది ఇవ్వాలనిపించింది అతనికి...గ్లాసులోని మిగతా పాలుకూడా ఆడపిల్లుల ముందున్న సాసర్లలో పోసేశాడు కిల్లింగ్ ఛాంబర్లో అంతకుముందేవున్న ప్రాణంలేని పిల్లిని డిసెక్షన్ టేబులు మీద పెట్టేడు. అతినైపుణ్యంగా దాని మెడదగ్గర చర్మం కోసేడు... టేబిలు మీదున్న పరికరాల్తో అతను చకచక తనపని చేసుకుపోతున్నాడు ... 'తర్వాత ఎల్లో మాస్...రెడ్మాస్... వీనస్ సిస్టమ్లోకి... ఆర్టీరియల్

సిస్టమ్‌లోకి ఇంజెక్ట్ చెయ్యాలి...' అని తనలోతను అనుకున్నాడు. తర్వాత కంటిచివర్లనుంచి ఆమెనోసారిచూసేడు. ధూళి పట్టినట్టున్న కళ్ళతో ఆమె విశ్చలంగా చచ్చి పడున్నపిల్లి మొండెంవేపూ- తెగి పడిఉన్న తలవేపూ - బయటికి వెళ్లకువచ్చిన దాని నాలుక వేపూ చూస్తోంది. ఆ కళ్ళలో ఎలాంటి భావ పంచలనం లేదు. పాతికేళ్ళు దాటని వయస్సులో ఈ నిర్లిప్తత ఎంత ఆశ్చర్యకరం! 'అసాధ్యురాలు' అనుకున్నాడు జయరామ్ మనస్సులోనే.

"ఆఁ- నేనిప్పుడు రెడీ!" అన్నాడు.

ఆ మాటకే ఎదురుచూస్తున్నట్టుగా "మీదగ్గర పాములున్నాయా?" అంది వెంటనే.

"ఓ- చాలా వున్నాయి. ప్రస్తుతానికిక్కడ నాలుగున్నాయి. వాటి విషాన్ని సేకరించి 'ఏంటీవెనమ్ లేబరేటరీస్'కి పంపిస్తాన్నేను . ఏం? ఎందుకలా అడిగేరు?"

ఆమె చూపులు అతనిమీదేవున్నాయి. కాని ఆ కళ్ళు అతని శరీరంలో ఏ భాగాన్ని చూస్తున్నాయో చెప్పడం కష్టం.

"మీ దగ్గర ఆడపాము వుందా? ఆడది:.."

"ఊఁ... వుంది. సాధారణంగా ఈ వెధవపాముల్లో ఆడదేదో మగదేదో తెలుసుకోవడం మహాకష్టం. లక్కీగా ఇవాళ పొద్దున్నే రెండుపాములు కోయిషన్లో... అంటేతెలుసుగా... సరసాల్లో వుండగా చూసేను. అంచేతే నా దగ్గర ఆడపాము ... వుందని గ్యారంటీగా చెప్పగలను."

"అదికాదు నా వుద్దేశ్యం... నాగుపాము... ఆడది..." అందామె.

"ఓ- అదా! చెప్పరేం? వుంది అసలైన మొగలినాగువుంది..." అన్నాడు జయరామ్.


"ఏదీ - ఎక్కడ?"

"అదిగో- ఆ కిటికీ పక్కన అద్దాల బీరువావుంది...చూశారూ- అందులో!"

ఆమె ఒక్కతల మాత్రం నెమ్మదిగాతిప్పి అటుచూసింది. మరుక్షణంలో తలని తిప్పి జయరామ్‌ని చూసింది. 'దాన్ని చూడొచ్చా నేను?' అని అడిగింది... జయరామ్ లేచి అద్దాలబీరువా దగ్గరికి నడిచేడు. నాగుపాముతప్ప మిగతావన్నీ బద్ధకంగా పడుకుని వున్నాయి. నాగుపాము మరింతముందుకి వంగి నాలికను వివరీతంగా ఆడిస్తోంది. చిరాగ్గా వెనక్కి చూసేడు. ఆమె అతని వెనకనే విలబడివుంది. ఆమె ఉచ్ఛ్వాస నిశ్వాసాలూ- మొగలినాగు బుసబుసలూ అతని చెవుల్లో ఒక్కసారి గింగురుమన్నాయి.

"దీని గురించేనా మీరుచెప్పేరు..." అందామె చాలా వుదాసీనంగా.

"అవును. ఇదే! పడగవిప్పి నిలబడిందే- ఇది. దీన్ని మొగలినాగు




అంటారు. మొగలిపువ్వు రంగులో వుంటుంది. ఇది సాధారణంగా మొగలి పొదల్లో దాక్కుని వుంటుంది. దీని పొడవు రమారమి అయిదడుగులు. చాలా అల్లరిగొడ్డు. ఇక్కడవున్న ఎలకన్ని చాలావాట్ని ఇదే మింగింది. మిగతా పాములకి ఆహారం వెయ్యాలంటే దీన్ని కేసులోంచి బైటికి తియ్యాల్సిందే!"

—అలా అన్నాడు కాని అదిఅబద్ధమని జయరామ్‌కి తెలుసు. మొగలినాగుని తను పట్టుకుని దాదాపు నాలుగేళ్ళయింది. మొగలిపువ్వుల్ని- వాటి రంగునీ నాగేశ్వరి ప్రేమిస్తుంది. నాగేశ్వరి వేట్ని యితే ప్రేమిస్తుందో వాటిని తను ద్వేషిస్తాడు. నిజానికి మొగలినాగు తిండి తిని దగ్గర దగ్గర ఏడాది గడిచింది...!...

పడగెత్తిన నాగుపాముని కన్నార్పకుండా చూడసాగిందామె. పాము నోట్లోంచి అప్పుడప్పుడు బైటికి వస్తోన్న నాలిక్క ఆమెచూపులు అతుక్కుని పోయేయి. ఆమె దృష్టిని ఆకర్షిద్దామని జయరామ్ చిన్నగా దగ్గేడు. కాని ఫలితం శూన్యం!

"పాముల్లో" [illegible] అయిదువందల రకాలున్నాయి... అఫ్‌కోర్స్... మన దేశంలో రెండువందల పదహారు రకాలే వున్నాయనుకోండి. పాముల్లో చాలామట్టుకి అన్నీ గుడ్లే పెడ్తాయి... రస్సెల్స్ వైపర్ మాత్రం పాముపిల్లల్నే కంటుంది. నీడగా - పొడిగా వున్న చోట్లలో పాములు గుడ్లుపెడ్తాయి..." అంటూ ఆగి ఆమెవేపు చూసేడు.

ఆమె దృష్టి మరల్చుకుంటూనే - "ఆ పాముని నాకు అమ్ముతారా?" అంది.

"అమ్మడమా? మీకా?"

"అవును. నాకే. మీరు 'స్పెసిమన్స్' అమ్ముతారుగా!" అని ఎదురుప్రశ్న వేసింది.

'అమ్మో. గడుసుపిండమే. అన్నీ కనుక్కొని మరీవచ్చింది' అనుకున్నాడు జయరామ్.

"అమ్ముతా ననుకోండి...అలాగే."

"ఎంత ఏభయ్యా? వందా?"

"వందరూపాయ లుంటుంది...కాని, అసలు పాములగురించి మీకేమయినా తెలుసా? అందులోకీ ఇది మొగలినాగు. మిమ్మల్ని కాటేసే ప్రమాదం వుంది. దానికి ఇంజక్షన్ నీడిల్స్‌లాంటి కోరలు రెండున్నాయి. అందులోంచి విషం చిమ్ముతుంది. పాము కాటేసిన ఏడు నిమిషాల్లో రియాక్షన్ స్టార్టవుతుంది. జీవనాడులమీదగాని కోర నాటిందంటే నాలుగునిమిషాల్లోనే అంతా సఫా!"

ఆమెదృష్టి మొగలినాగు మీద వుంది.

"మొగలినాగు మనసారా ముద్దు పెట్టుకుంటే దగ్గర దగ్గర ఖచ్చితంగా రెండు వందల మిల్లీగ్రాములవిషం రక్తనాళాల్లో చిమ్ముతుంది. కాని మనిషి ప్రాణం తియ్యడానికి 12 మిల్లీగ్రాముల విషం చాలు.. దీన్ని 'వైపర్' అంటారు. ఇదిగాని కాటేస్తే నూటాఏభై మిల్లీగ్రాముల విషం కక్కుతుంది. మనిషి హరీ అనడానికి పదిహేను మిల్లీగ్రాముల విషంచాలు... ఇది చూసేరా ... దీన్ని 'క్రేట్' అంటారు. ఈపాము గట్టిగా కాటేసిందంటే ముప్ఫయ్ మిల్లీగ్రాముల విషం రాలుస్తుంది. తమాషా ఏంటంటే- ఆరోగ్యవంతుడైన మనిషి చావడానికి దీనివిషం ఆరు మిల్లీగ్రాములే చాలు! వీటివిషం మొదట బాడీ టిష్యూల మీద రియాక్షన్ ప్రారంభిస్తుంది అనక శరీర మంతటా రక్తనాళాల్లో వ్యాపిస్తుంది..." అంటూ జయరామ్ ఆగేడు. జేబులో చెయ్యిపెట్టి సిగరెట్ పేకెట్ - అగ్గిపెట్టె తీసేడు. పెదాలమధ్య సిగరెట్ వుంచి అగ్గిపుల్ల వెలిగించేడు. గట్టిగా దమ్ములాగి ఆరిన అగ్గిపుల్లని ఓమూలకి విసిరేసేడు అంతసేపూ ఆమెని చాలా నిశితంగా పరీక్షించేడు... ఆమెకి పాతికేళ్లు మించి వుండవు ఏకారణంవల్లో శరీరం చిక్కినా ఆమె ఒకానొకప్పుడు చాలా సౌందర్యవతి అని నిస్సందేహంగా చెప్పొచ్చు. చిందరవందరగావున్న ఆమె కేశపాశం సరైన మాలిలేని పూలతోటలా వుంది. కళ్ళు ఎన్నోఏళ్ళుగా ధూళిపట్టిన ఇంద్రనీల మణుల్లా వున్నాయి. ఎన్నో భయంకరదృశ్యాలు చూసి విసిగిపోయిన అలసట-ఆ కళ్ళల్లో వుంది. ఆమె ఎండినపెదాలు గోదారి గట్లలా వున్నాయి. ఆమె ముఖంమీద నీడలు - పంట కోతకొచ్చినపుడు ఆకా

శంలో ముసురుకొనే మేఘాల్లా నల్లగా వున్నాయి పాతికేళ్ళు నిండని యువతిలో ఏమిటీ నిర్లిప్తత ? ఎందుకీ వుదాసీనత ?— అర్థంకాలేదు జయరామ్‌కి.

"ఆ పాముని నేను తీసుకెళ్ళను. ఇక్కడే మీదగ్గరే వుంచుతా. కాని ఆ పాము నా సొంతమేనన్న భావం నాకు కలగాలి. అప్పుడప్పుడు వచ్చి దానికి నేను ఆహారం వేస్తాను ... నాక్కావల్సిందదే!" ఎదురుగుండా వున్న కిటికీ రెక్కలో మాటాడినట్టు అందామె. మరుక్షణంలో చేతిలోని బ్యాగ్ విప్పింది. అందులో చెయ్యిపెట్టి గబగబ కెలికింది. సరికొత్త వందరూపాయల నోటుతీసి జయరామ్ చేతికిచ్చింది ... "ఇప్పుడీ మొగలినాగు నాది...ఏమంటారు?" అంది అతని కళ్ళలోకి ఓ క్షణకాలం చూసి

ఆ మాటలు జయరామ్ మనస్సులో కలవరం రేకెత్తించేయి. ఆ యువతి ప్రవృత్తినేకి అతన్లో భయసందేహాలు తలెత్తి బుసకొట్టేయి.

"దాన్ని చూద్దామంటే మీరు డబ్బే యివ్వఖ్ఖర్లేదు. ఎప్పుడు కావాలంటే అప్పుడువచ్చి చూడొచ్చు. నేనేం అభ్యంతరపెట్టను..." అన్నాను.

"అవున్లెండి. కాని ఆ పాముని కొన్న తృప్తి నాక్కావాలి!"

జయరామ్ అంతగా తన జీవితంలో ఎన్నడూ ఆశ్చర్యపోలేదు. తన పక్కనున్న ఈ స్త్రీ...స్త్రీయేనా అన్న అనుమానం మెల్లిగా అతన్లో ప్రవేశించింది. అసలామె వుద్దేశ్యం ఏమిటి?

నాగేశ్వరి స్మృతుల్ని రగుల్కొలిపే ఆ మొగలినాగుని అంతం చెయ్యాలన్నది అతని ఆశయం. అది పట్టుకున్నదీ అందుకే! దాన్ని పస్తుల్తో బాధిస్తూందీ అందుకే! మరి కథేమిటిలా అడ్డం తిరిగింది? ఈవిడగారు దాన్ని పోషిస్తానంటోందేమిటి?

"ఈ పాము మీ కెక్కడ దొరికింది?"

"బొంబాయిలో!"

"మీరేనా పట్టుకున్నారు...ఎలా?"

"నేను పట్టుకోలేదు. వాళ్ళన్నయ్యకి వుత్తరం రాస్తే— పాపం, తనే నచ్చింది స్టేషన్‌కి .."

పాముమీద నిల్పిన చూపుని చటుక్కున జయరామ్‌మీదికి మరల్చిందామె. కళ్ళు ఇంతింతలు చేసుకొని అతన్నే చూడసాగింది. ఆమెలోని ఈ హఠాత్ పరిణామం జయరామ్‌ని జాగ్రదవస్థలోకి తెచ్చింది. తన పొరబాటుకూడా అతనికి తెలిసివచ్చింది.. అయినా 'ఏమన్నారూ?' అన్నాడు.

"ఈ పాము మీ కెక్కడ దొరికింది? అసలు సాధారణంగా పాము లెలా దొరుకుతాయి?" అంది తల మళ్ళీ పాము వేపు తిప్పి.

"ఈ మొగలినాగు నాకు సింహాచలంకి రెండుమైళ్ళదూరంలో వున్న ఓ మొగలి పొదలో దొరికింది. నేనే పట్టుకున్నాను.

పాములు నీడగానూ పొడిగానూ ఉండే ప్రాంతాల్లో గుడ్లు పెడ్తాయి. కాని పక్షుల్లా వాట్లని పొదగవు. ప్రకృతే ఆ పని చేస్తుంది. ఈరకం పాములు మూడు రోజుల్లో సుమారు ఏభై అరవై గుడ్లు పెడ్తాయి. ఆ గుడ్లు రెండునెలల్లో వర్షా కాలం అప్పుడు పగుల్తాయి. అప్పుడే గుడ్డులోంచి బైటికొచ్చిన పాముపిల్లకి కూడా పెద్దదానిలాగా పడగ వుంటుంది. చుట్టుపక్కల వుండే డిస్టర్బెన్సెస్‌కి చాలా షార్ప్‌గా రియాక్ట్ అవుతుంది. పుట్టిన మరుక్షణంనుంచీ పాముపిల్ల తలదగ్గ రుండే 'వెనమ్‌గ్లాండ్స్' ... అంటే .... విషగ్రంథులు పనిచేయడం ప్రారం భిస్తాయి..."

జయరామ్ ఆఖరి మాటలంటున్నపుడు ఆమె హఠాత్తుగా దృష్టి మరల్చి అతని కళ్ళలోకి గుచ్చి చూసింది. "పుట్టిన మరుక్షణంనుంచీ మగాడికి ఆ స్త్రీహక్కులు సంక్రమించినట్టు...!" అంది. అనేసిన వెంటనే దృష్టిని మళ్ళీ మొగలినాగు వేపు తిప్పింది.

ఆమె ఏమందో జయరామ్‌కి అర్థం కాలేదు. అర్థంచేసుకోడానికి ప్రయత్నిం చనూలేదు. సిగరెట్ పీల్చి ఆమె ముఖం మీదికి పొగని వదిలేడు. వదిలేక—ఎందు కలా చేశానా అని తనని తాను నిందించు కున్నాడు. నల్లటి మేఘాల్ని ఆడుకో డానికి రమ్మని ఆహ్వానిస్తోన్న తెల్లని మేఘాల్లా పొగ ఆమె తలమీద సుళ్ళు తిరిగింది... జయరామ్ మళ్ళీ ప్రారం భించేడు. "పుట్టిన మరుక్షణంనుంచీ తన్ను తాను రక్షించుకోవలసిన బాధ్యత పాముపిల్లదే! అప్పుడే కళ్ళుతెరిచిన పాముపిల్లకి ఎందరో శత్రువులు ... ప్రకృతిసిద్ధమైన శత్రువులు కొన్ని ... చలిచీమలూ ... తమాషా ఏమిటంటే — దాని జాతి పాములే దాన్ని తినేసే ప్రమాదంకూడా వుంది. దీన్ని 'కేనిబా లిజమ్' అంటారు. ఇది పాముల్లో విప రీతంగా వుంది. ఆ పిల్లలు తాముపెట్టిన గుడ్లబాపతువే అన్న ఇంగితజ్ఞానం వాటికి వుండదు."

అంతలో ఆమె మళ్ళీ తల తిప్పింది. ఏమంటుందో విందామని ఆగేడు జయ రామ్. అల్పంగా వుండే రంగులేని ఆమె పెదాలు స్వల్పంగా వంకర్లు తిరిగేయి. ఆ తిరగడంలో నిరసనభావం కొట్టొచ్చి నట్టుంది. "బావుంది. పాముపిల్లకి పామే శత్రువన్నమాట!... ఈనాడు స్త్రీకి శత్రువు స్త్రీయే అయినట్టు" అంది. అంటూ తల కిందికి దించింది.

'గుడ్. దార్లో పడ్తోంది' అనుకు న్నాడు జయరామ్. "ఏమన్నారూ? స్త్రీకి శత్రువు స్త్రీయా?" అన్నాడు.

వంచిన తల ఎత్తకుండానే "ఆమాట నాదికాదు. ఈ మధ్యే ఏదో పత్రికలో వ్యాసం ఎవరో రాస్తే చదివేను. ఆడదానికి ఆడదే శత్రువట. ప్రతితల్లీ తనకొడుక్కి కట్నం పుచ్చుకోకుండా పెళ్ళిచేస్తే వర



కట్నాల బెడదే వుండదుట! విధవా వివాహం చేసుకున్నా—ఒంటరిగా వుద్యోగాలు చేసినా—ఎంతకీ పెళ్ళికాకపోయినా ఆక్షేపించేదీ గుసగుసలుపోయేది ముందు ఆడవారేగా! అంచేత స్త్రీకి శత్రువు స్త్రీయే!—అంది అవిడెవరో!" అన్నదామె.

"పొదగటం అయ్యేక కళ్ళు తెరిచిన పాముపిల్ల వెంటనే అటూయిటూ కదల్లేదు. దాని శరీరం చుట్టూ పచ్చసొన అంటుకుని వుంటుంది. ఆ పచ్చసొనే మొదట పాముపిల్లకి గుడ్డులో వున్నప్పుడు ఆహారం. గుడ్డు పగిలి పాముపిల్ల తలెత్తినప్పటికీ — ఈ పచ్చసొనే దానికి ఆహారంగా వుపయోగపడ్తుంది...పాము పిల్ల పెద్దదయ్యేకొద్దీ గండాలే!"

"ఆడపిల్లలాగే!"

జయరామ్ ఆమె అన్నమాట వినలేదు. తన ధోరణిలో తను వున్నాడు.

"తరచూ పై పొరరాలుస్తూండటం దానికో పెద్ద సమస్య. పై పొర కొద్దికొద్దిగా రాల్తోంటే దాని కింద దానికన్నా పెద్ద పొర తయారౌతూ వుంటుంది. ఈ సమయంలో...దాన్ని 'మిల్క్ ఫ్లూయిడ్' అంటారు ... అది పై పొర విసర్జించడంలో ఎంతో ఉపకరిస్తుంది. ఇంకో విశేషం: పాము కళ్ళకి ట్రాన్స్‌పరెంట్ కనురెప్పలు వుంటాయి. పాము కళ్ళ

మూసుకునివున్నా తెరుచుకుని వున్నట్టు మన కందుకే అనిపిస్తుంది. ఈ పొలుసుల ఆకళ్ళల్లోంచే కారుతుంది ... పైపొర విసర్జించే కాలంలో పాముకి కళ్ళు కన్పించవన్న మనవాళ్ళ నమ్మకాని కిదే కారణం అయివుంటుంది..." అంటూ మరోసారి గట్టిగా సిగరెట్ పీల్చేడు.

ఆమె అద్దాల బీరువాకున్న అద్దం మీద మోచేతిని ఆనించింది. మొగలి నాగు తలని ఇంకొంచెం ఎత్తి ఆమె మోచేయి ఆనిన ప్రదేశాన్ని నాలుకతో స్పర్శిస్తోంది. ఆమె చెయ్యి చూడగానే జయరామ్‌లో మరో ఆలోచన మెరిసింది...ఆమె చెయ్యికీ పాముకీ ఏమీ భేదం లేదు. పాము పొడవు అయిదడుగులు. ఆమె చెయ్యి పొడవు రెండు అడుగులు వుండొచ్చు. పాముకి కోరలున్నాయి. ఈమె వేళ్ళకి గోళ్ళున్నాయి. వాటి కోరల్లో విషం వున్నట్టు ఈమె గోళ్ళల్లో లేదు. అంతే తేడా!

"అవేమిటి తింటాయి?" అందామె.

జయరామ్ ఒక్క క్షణంపాటు ఆలోచించేడు. నాగేశ్వరికి లడ్డూలు. అందులో బందరులడ్డూ ఎంతో యిష్టం. గులాబ్ జామ్ నాగేశ్వరి నెక్స్ట్ లవ్!

"సాధారణంగా పాములన్నీ ఆహారాన్ని పట్టుకుని మింగేస్తాయి. కొన్ని రకాల పాములు చిన్నచిన్న పురుగుల్నీ కీటకాల్ని తింటాయి. కొన్ని పాములు పెద్దపెద్ద జంతువుల్ని తింటాయి. మరి కొన్ని తమకన్నా ఎన్నోరెట్లు పెద్దవైన జంతువుల్ని స్వాహా చేస్తాయి. ప్రకృతి వింతల్లో ఇదొకటి."

"వింతేముంది? తమకన్నా అధికులైన ఆడాళ్ళనికూడా మగాళ్ళు అణిచెయ్యటం లేదూ? అలాగే_" అంది.

"ఆహారం మింగేక కొన్ని పాములు కదలకుండా రోజులతరబడి అలాగే వుండిపోతాయి. తిన్నది అరిగితేనేగాని వాటికి మోక్షం వుండదన్నమాట. చలికాలంలో వాటిల్లో చురుకుపాలు తగ్గుతుంది. మందకొడిగా తయారౌతాయి. విపరీతమైన వేడినికూడా భరించలేవు." అంటూ చేతిలోని సిగరెట్‌ని ఆష్‌ట్రేలో పడేశాడు జయరామ్.

"భారతదేశపు స్త్రీల్లా అవి చాలా సుకుమారమైనవన్నమాట!" అందామె సాలోచనగా తలాడిస్తూ.

జయరామ్ మాట్లాడలేదు.

"నా మొగలినాగు సాధారణంగా ఏవేంటి తింటుంది" అందామె మళ్ళీ.

"అక్కడ బోనులో వున్నాయి చూసేరా...? తెల్ల ఎలకలు... అవే దానికి ఆహారంగా వేస్తాను..."

"నా మొగలినాగుని మరో గ్లాస్‌కేజ్‌లోకి మారుస్తారా? ప్లీజ్_దానికి బువ్వ పెడ్తాను..."

జయరామ్ చికాగ్గా మనస్సులోనే గింజుకున్నాడు. ఆవిడ మాటల్లో విప్రార్థన...కాదు; ఆజ్ఞ అతని చెవుల్లో కర్కశంగా నాటింది.

"కాని, దాని కిప్పుడు మళ్ళీ ఆహారం ఎందుకు? వారంరోజుల కిందటే మొగలినాగు ఓ ఎలకని తిన్నది. ఈ పాములు అసలు నాలుగైదు నెలలదాకా ఒకోసారి ఏమీతినవు" అన్నాడు

"నాకో ఎలకనికూడా అమ్మాలి మీరు" అంది అతని మాటల్ని విననట్టే.

జయరామ్ కనుబొమలు ఎగరేసేడు. "ఎలకని మొగలినాగు ఎలా చంపి తింటుందో చూడాలని మీకుందన్నమాట. ఆల్‌రైట్! నేను చూపిస్తాను. ఎలక ఖరీదు రూపాయి అవుతుంది ఓ దృక్కోణంలో చూస్తే బుల్‌ఫైట్‌కన్నా కోడి పందేలకన్నా ఇదే బావుంటుంది. మరో ఏంగిల్లో - పాముగారు సింపిల్ డిన్నర్ ఆరగించడం కన్పిస్తుంది..." అనుకోకుండానే జయరామ్ గొంతుక కరినంగా మారిపోయింది. ప్రకృతి సిద్ధమైన ఘర్షణల్ని చూసి దాన్ని క్రీడగా ఆనందించే మనుష్యులంటే అతనికి పరమ అసహ్యం. రోత. అతను క్రీడాకారుడు కాదు. జీవశాస్త్రజ్ఞుడు. విజ్ఞానసముపార్జన కోసం అతను వేలాది జీవరాసుల్ని నిర్దయగా చంపగలడు. కాని, వ్యక్తిగత అభిరుచులకోసం-తాత్కాలిక పైశాచికానందంకోసం దోమనికూడా చంపలేదు.

ఆమె తనతలని నెమ్మదిగా జయరామ్‌వేపు తిప్పింది. సన్నంగా అల్పంగా వుండే పెదాలమీదికి అతకని చిరునవ్వు తెచ్చుకుంది. ఏవోలోకాలు జయించిన వింత వెలుగు కళ్ళల్లో మెరిసింది. "నా మొగలినాగుకి ఆహారం పెట్టాను" అంది. అంటూనే మొగలినాగు వున్న అద్దాలబీరువా తలుపు ఎత్తింది. ఇంకా ఏం చేద్దామనుకుందో-కాని పక్కనున్న జయరామ్ ఆమెచేతిని చటుక్కున వెనక్కిలాగేడు. పెద్దశబ్దం చేస్తో బీరువా మూతపడింది.

"ఏమండీ, మీకేమన్నా మతివుందా? పోయిందా? పాములున్న బీరువాలో మనిషన్నవాడెవడేనా ఇలాగేనా చెయ్యి పెట్టేది? పాములు కాటేస్తే-!" అనరిచేడు జయరామ్ కోపంగా.

"సరే - దాన్నా బీరువాలో మీరే పెట్టండి!" అందామె నిమ్మళంగా-ఏమీ జరుగనట్టు!

జయరామ్ శరీరం స్వల్పంగా వణికింది. దేన్నీ స్పష్టంగా చూడనట్టు చూసే ఆమె కళ్ళలోని సూదులు అతన్ని యమబాధపెడ్తున్నాయి. ఆ పాము ఆకలికి ఎలకని బలిచెయ్యడం చాలాతప్పని ఎవరో ఘోషిస్తున్నట్టయింది. అతనికి తెలుసు. అది చాలాపాపం! ఎందుకో తెలీదు...చేయరాని తప్పు చేస్తున్నట్టు - అపరాధిలా నిలబడ్డాడు. స్వయంగా తన చేతుల్తో ఎన్నో ఎలకల్ని చంపేడు. కత్తుల్తో దాని దేహాన్ని చీల్చి చెండాడేడు. కాని అది వేరు. దాంట్లో విజ్ఞాన తృష్ణ వుంది. ఇందులో కేవలం హత్యా

ప్రవృత్తి వుంది. నవనాడులూ ఒక్కసారి కుంగినట్టు నీరసించిపోయేడు. రెండుక్షణాలపాటు దీనిగురించి తనకి తాను సమాధాన పర్చుకోడానికి ప్రయత్నించేడు.

"చూడ్డానికి బాగానే వుంటుందిలెండి. నోట్లోపడబోయే ఆహారాన్ని చూసి పాము ఎలా ప్రవర్తిస్తుందో తెలుసుకోవడం ప్రతివారికీ అవసరమే!" అన్నాడు సాధ్యమైనంతకరినంగా. తర్వాత పక్కనే వున్న చిన్నకర్రని అందుకున్నాడు దాని చివర్న జారుముడి వేయబడ్డ తోలుబెల్టు వుంది. బీరువా తలుపు తీసి దాన్ని మొగలినాగు మెడకి తగిలించి తాడు బిగించేడు. తోకని విసురుగా అద్దానికి కొట్టిందది. మరుక్షణంలో చరచరా కర్రకి చుట్టుకుపోయింది. దాన్ని తీసుకెళ్ళి మరో ఖాళీ బీరువాలో పడవేశాడు జయరామ్. మొగలినాగు పడగయెత్తి అటూ ఇటూ చూసి రెండు మూడుసార్లు బుస్సుమంది. కొన్నిక్షణాలకి నెమ్మదిగా బీరువాలో ఓ మూలకి జరిగింది. పడగ మాత్రం విప్పుకునే వుంది. నాలుక అదిస్తోనే వుంది.

"ఈ పాము లన్నింట్నీ నేను బాగానే మచ్చిక చేశాను. కావాలంటే చేతితో కూడా ముట్టుకోగలను. అయితే దాని వల్ల ఎప్పుడో అప్పుడు చచ్చే అవకాశం వుంది. ఆ అవకాశం పాము కివ్వడం నా కిష్టంలేదు. అందుకే ఇంతజాగ్రత్త తీసుకుంటున్నాను..." అన్నాడు జయరామ్.

ఆమె జయరామ్ మాటలు వింటున్నట్టు లేదు. మొగలినాగు పడగమీదే ఆమెదృష్టి నిమగ్నమై వుంది. "ఇప్పుడు ఎలకని వెయ్యండి" అంది నిశ్చలంగా. ఆమె మాటలు ఎక్కడో దూరంగా నూతిలోంచి వచ్చినట్టు వినబడ్డాయి.

అయిష్టంగా జయరామ్ ఎలకలబోను దగ్గరికి నడిచేడు. జరుగబోయే సంగతి తలుచుకుంటోంటే అతని ఒళ్ళు జలదరిస్తోంది. అలాంటి అనుభవం అతనికిదే మొదటిసారి... బోనులోని ఎలకలు అటూఇటూ కదులుతున్నాయి. 'ఏ ఎలక' అనుకున్నాడు మనస్సులో. అంతలోనే చటుక్కున ఆమెవేపు తిరిగేడు. "పోనీ-ఓపని చేస్తాను. మొగలినాగున్న బీరువాలో పిల్లిని వేస్తాను. అదీ అసలైన యుద్ధం. ఒకో అప్పుడు రాత బాగుంటే పిల్లే గెలుస్తుంది ... కావాలంటే పిల్లిని అమ్మతాను ... ఏమంటారు...?" అన్నాడు ఆశగా.

ఆమె కనీసం అతనివేపైనా చూడలేదు. "ఆ బీరువాలో ఎలకనే వెయ్యండి. ....ప్లీజ్!" అంది."

కుడిచేతికి తోలుగ్లవ్స్ తొడుక్కుని దాన్ని ఎలకల బోనులో పెట్టేడు. చేతికి ఏదోతోక తగిలింది దానితోకని పట్టుకుని గాల్లోకి ఎత్తేడు తలకిందులుగా వేలాడుతున్న ఎలకనీ - దాని ఎర్రటి కళ్ళనీ -



బాగా బలిసిన శరీరాన్ని ఒక్కక్షణం జాలిగా చూసేడు జయరామ్. ఎలక గిల గిల తన్నుకుంటూ అతని చేతివేళ్ళని కరవబోయింది. కాని దాని ప్రయత్నం విఫలమైంది. దాన్నలాగే తీసుకెళ్ళి అద్దాల బీరువాలో మొగలినాగు పక్కన పడవేశాడు జయరామ్... "అదీ - ఇప్పుడు చూడండి...అసలు తమాషా!" అనరిచేడు అప్రయత్నంగా.

ఆమె ఏమీ మాట్లాడలేదు. నిశ్చలంగా వున్న మొగలినాగుకి ఆమెదృష్టి అతుక్కుపోయి వుంది. బీరువాలోని వాతావరణాన్ని పరిశీలించేందుకు నాలుకని క్షణక్షణానికీ చాపుతోంది-పాము.

బీరువాలో వెల్లకిలాపడిన ఎలక కాసేపు తన్నుకుని అతిప్రయత్నంమీదా నాలుగుకాళ్ళమీదా నిలబడింది. మెల్లిగా వెనక్కితిరిగి తోకని ఓసారి నాక్కుంది. ఏం తోచనట్టు అటూ ఇటూ రెండు అడుగులు వేసింది. బీరువా అడుగున వున్న ఇసుకని వాసనచూస్తూ ఓ మూలకి నడవసాగింది ... గదంతా నిశ్శబ్దమైపోయింది. అచే తదేక దీక్షగా చూస్తోన్న ఆ యువతి చిన్న నిట్టూర్పు విడిచింది. ఆ నిట్టూర్పుకి - మొగలినాగు బుసకి పెద్దతేడా కన్పించలేదు - జయరామ్‌కి. బీరువాలోని పామునీ ఎలకనీ చూస్తూ ఆమె బిర్రబిగిసిపోవడం కంటిచివర్లతో గమనించే దతను.

మొగలినాగు నెమ్మదిగా కదలడం ప్రారంభించింది. నాలుక నిదానంగా ఆడిస్తోంది. దాని కదలిక ఎలా వుందంటే - అది కాస్తయినా ముందుకి జరుగుతున్నట్టే లేదు. అతినిశ్చలంగా జరుగుతోంది.

బీరువాలో మరోమూలని ఎలక చోటు చేసుకుంది. వెనకకాళ్ళమీద కూర్చుని పొట్టమీదున్న వెంట్రుకల్ని ఏం తోచ నట్టు నాకుతోంది. మెడని 'S' ఆకా రంలో వంచి నాగు అతినెమ్మదిగా ముందుకి జరుగుతూంది... గదిలోని నిశ్శబ్దం జయరామ్‌కి అతిభయంకరంగా తోచింది. ఆవేశంతో అతని రక్తనా ళాలు వుబ్బిపోతున్నాయి. ఆవేదనతో మొహం ఎర్రబడ్తోంది. ఒక్కసారి శరీరంలోని రక్తమంతా గడ్డకట్టుకు పోతుందేమో నన్పించింది.

"అదుగో – చూడండి. చూసేరా? మెడ ఎలా వంచిందో...కాటేసేముందు ప్రతిపామూ ఆ పొజిషన్లోనే వుంటుంది. నాగుపాములు చాలా జాగ్రత్తయినవి. అంతేగాదు. అవి మహా పిరికిగొడ్లు. ఒకే ఒక్క దెబ్బ. అంతే! దాంతోనే ఏదైనా సఫా అయిపోవాలి......!" అన్నారు జయరామ్.


బోనుకి దాదాపు ఓ మూలని వుండే ముగలినాగు మెల్లిమెల్లిగా సగం దూరం వచ్చేసింది. హఠాత్తుగా ఎలక తల ఎత్తింది. ఏదో కర్రనో దూలాన్నో చూసినట్టు ముగలినాగును చూసింది. తర్వాత మళ్ళీ పొట్ట నాక్కోవడం ప్రారంభించింది. ఊపిరి బిగపట్టి అదే చూడసాగేడు జయరామ్. ఆమె సంగతి చెప్పనే అక్కర్లేదు!

ఇప్పుడు పాము మరీ దగ్గరకొచ్చే సింది. తలని రెండంగుళాల ఎత్తులో వుంచింది పడగ నెమ్మదిగా – అతి నెమ్మ దిగా ముందుకీ వెనక్కీ వూగసాగింది. ఆ వూగడం ఎందుకు...? గురితప్పని దెబ్బకోసం.... తినబోయేదానికీ – తన నోటికీ మధ్యవున్న దూరం అంచనా వేయడంకోసం!! జయరామ్ మళ్ళీ ఆమె వేపు చూసేడు...ఒక్కసారిగా అతన్ని నిస్సత్తువ ఆవహించింది. ఆమె దేహం కూడా ఉద్రేకంగా వెనక్కీ ముందుకీ వూగడం అతను గమనించేడు...

ఎలక మళ్ళీ తలెత్తి నాగుపాముని చూసింది. నాగు నెమ్మదిగా కాస్త వెనక్కి జారింది మరింత నెమ్మదిగా తలెత్తింది.. అంతే–ఆ తర్వాత మెరుపు మెరిసినట్టు ముందుకి వంగింది ముగలినాగు కర్రుకు దెబ్బ తిన్న మంచిదొంగలా అంతెత్తు ఎగిరిపడింది ఎలక. ఏ మూలనుంచి వచ్చిందో ఆ మూలకే గబగబా జారి పోయింది నాగు సున్నాలు చుట్టుకొని – పడగ బాగా విప్పింది. నాలుక ఆడిం చటం ఇంకా మానలేదు.

"పెర్ఫెక్ట్. దెబ్బంటే – అదీదెబ్బ... సరిగ్గా షోల్డర్ బ్లేడ్స్ మధ్య...కోరలు దాని గుండెలోకే ఖచ్చితంగా దిగుం టాయ్!" అన్నాడు జయరామ్ అప్రయ త్నంగా.

ఎలక కాసేపు గిజగిజమని ఒక్కసారి కళ్ళూ కాళ్ళూ తేలేసింది...ఆఖరిసారిగా మరోసారి కాళ్ళాడించి కదలకుండా




మెదలకుండా వుండిపోయింది... చచ్చిపోయింది. గుండెలమీదున్న పెద్దబరువు ఏదో తొలగిపోయినట్టు గట్టిగా వూపిరి తీసిందామె.

'వూఁ...ఎలావుంది ఈ అనుభవం?'

అతని ప్రశ్నకి జవాబుగా నల్లచుక్కల్లాంటి తన కళ్ళని అతనివేపు తిప్పిందామె...ఆముఖంలో ఎంత వుత్సాహం..! ఎంత వుద్రేకం...

"ఇప్పుడు - ఎలకని పాము తింటుందా? తినదా?"

"బాగుంది మీప్రశ్న? ఎందుకుతినదూ? దాన్ని సర్దాకోసం చంపిందనుకున్నారేఁవిఁటి? కడుపునిండా ఆరగిద్దామన్న వుద్దేశ్యంతోనే పాము దాన్ని హతమార్చింది!"

ఆమె కనుబొమలు విచిత్రంగా ముడివడ్డాయి. పట్టుదలతో పెదవులు బిగించింది. మొగలినాగుని మళ్ళీ వెనక్కి తిరిగి చూసింది. "ఎలకని తింటూండగా చూడాలనివుంది నాకు!" అంది.

మూలకిచేరిన మొగలినాగు మెల్లిగా ఎలుకవేపు రాసాగింది. ఆ ప్రాకడంలోని జాగ్రత్త ఆమెని ఆశ్చర్యపర్చింది. ఒకవేళ ఎలక చావకపోయి - హఠాత్తుగా తిరగబడితే-? దానికి తట్టుకోవద్దూ? నాగుపాము ఎప్పుడూ తన జాగ్రత్తలో తనుంటుంది. మొద్దుబారిన ముక్కుతో వెల్లకిలా పడున్న ఎలక దేహాన్ని వాసన చూసింది. అది చచ్చిపోయిందని నిర్ధారణ చేసుకున్నట్టు కాస్త వెనక్కి ధీమాగా జరిగింది. మళ్ళీ ముందుకొచ్చి నోరు తెరిచింది...

ఆదృశ్యంచూసే ధైర్యం...పోనీ... స్థయిర్యం . జయరామ్‌కిలేదు. కొన్నేళ్ళ దాకా ఈ విషాదదృశ్యం మరిచెరిగిపోదు. అందుకే ముఖాన్ని పక్కకి తిప్పు కున్నాడు ఎంచేతో అతనికి ఆమెముఖం చూడాలన్పించింది...... పాముతోబాటే ఆమెకూడా తననోరు తెరిచిందేమో... బలవంతాన ఆ కోరికను ఆణచు కున్నాడు జయరామ్.

మొగలినాగు నోట్లోకి మొదట ఎలక తలకాయ దూరింది. మెల్లి మెల్లిగా ఎలక లోనికి పోజొచ్చింది.

డిసెక్షన్ టేబిలుదగ్గర నిలబడి మరో సిగరెట్ వెలిగించేడు జయరామ్.

"కాస్త టీ తాగుతారా?" అన్నా డామెవిచూసి.

"నో_థాంక్స్."

సిగరెట్ పీలుస్తూ మళ్ళీ వెనక్కి తిరిగి ఆమెని సమీపించేడు. మొగలి నాగున్న బీరువాదగ్గర నిలబడివుందామె. ఎలక దాదాపు పాము నోట్లోకి వెళ్ళి పోయింది. తోకమాత్రం మిగిలింది నాగుపాము గొంతుకదగ్గర చిన్న వ్యాకోచం జరగ్గానే అదీ లోపలికి జారి పోయింది. దాని దంతాలు యథాప్రకా రంగా సాకెట్స్‌లోకి దూరిపోయేయి ఆ తర్వాత మొగలినాగు మరి తలెత్త లేదు. నాలుక చాచనూలేదు. బద్ధకంగా వెనక్కిజరిగి 8 అంకె వేసి పడుకుంది.

"నా నాగు యిప్పుడు నిద్రపోతుం దను కుంటాను. మరి నేను వెళ్ళొస్తాను వీలయినప్పుడల్లా ఒచ్చి నా పాముకి ఆహారం వేస్తూ వుంటాను. ఎలకలకి అయ్యే డబ్బుకూడా మీ కిస్తాను. సాధ్య మైనన్ని ఎలకల్ని ఆహారంగా వేద్దామ నుంది నాకు...ఎప్పుడేనా _ సమయం వచ్చినపుడు నా మొగలినాగుని నాతో తీసుకుపోతాను" అంది కలలో పలవరి స్తున్నట్టు.

"అలాగే" అన్నట్టు తలూపేడు జయరామ్.


"ఇంకో విషయం...మీ రేమీ అను కోరుగా_?"

"ఏమీ అనుకోను. ఏమిటది?"

"పాములగురించి మీరు చాలా తీవ్రంగా పరిశోధన చేస్తున్నట్టు విన్నాను. స్వయంగా "స్నేక్‌ఫారమ్" లాంటి దేదో స్థాపించబోతున్నారనీ విన్నాను... పాముల కలయిక ఎలా జరుగుతుందో చెప్పగలరా? దాని గురించి చాలా కథలు విన్నాననుకోండి. కాని నాకు నిజం కావాలి..." అంది తల వంచుకుని.

సిగరెట్ పీలుస్తూ ఆమె వంక సాభి ప్రాయంగా చూసేడు జయరామ్.

"చెప్తా వినండి. సాధారణంగా ఆ కోరిక ముందుగా మగదానిలోనే కలుగు తుంది. ఆ కోరిక కలగగానే ఆడదాని కోసం వెదకడం ప్రారంభిస్తుంది. వాస



పని బట్టి ఆడదాన్ని కనిపెడుతుంది. ఒకో అప్పుడు ఆడగానికోసం మైళ్లు ప్రాకవలసివచ్చినా మగది లక్ష్యపెట్టదు. ఆడది కనిపించగానే మగది తన శరీరాన్ని, దాని శరీరం కేసి రుద్దుతుంది. ఒకదాన్నొకటి పెనవేసుకుంటాయి. అంతే అదంతా–మగది తన కోరిక వ్యక్తపరచడం అన్నమాట. ఆడది దాని కభ్యంతరం పెడితే – మగది చక్కా వెనక్కి రావలసిందే ఆడదిష్టపడితేనే కలయిక సాధ్యం అవుతుంది...."

"ప్రపంచంలో ఆడదానిగా పుట్టే కన్నా ఆడపామై పుట్టడం ఎంత మేలు! అన్నట్టు–గుర్తుంచుకోండి ఈ మొగలి నాగు నాది. దాని కోరలు తియ్యొద్దు. వెళ్తాను" అంటూ ఆమె గుమ్మం వేపు నడిచింది...అంతలో ఏమనిపించిందో యేమో మళ్ళీ వెనక్కి వచ్చి మొగలినాగున్న బీరువా అద్దాన్ని ముద్దుపెట్టుకున్నంత పని చేసి యధాప్రకారంగా ముందుకి సాగిపోయింది....జయరామ్ ఓ కుర్చీ లాక్కుని కూర్చున్నాడు. చలనం

లేకుండా పడివున్న మొగలినాగుని చూసి మరోసారి మనస్సుకి సమాధానం చెప్పు కోబోయేడు...

గంట క్రితం జరిగిందంతా కలలా తోచిందతనికి. ఎంత అర్థం లేని సంఘటన!...కాని జరిగిన సంఘటనలో అర్థం లేకపోలేదనికూడా అన్పించింది అతనికి! తలెత్తి ఇంటి పైకప్పు వేపు చూసేడు...

సర్పాలన్నీ ఒక్కలా గేకన్పిస్తాయి. పొడవుగా - సన్నగా - అందంగా వుంటాయి. ప్రపంచంలో పాము ఎంత అందమైన సృష్టి...!?

...నాగేశ్వరి ఎంత అందగత్తె! ఆఖరి కేమైంది? తన ఆశలు మట్టిపాలు చేసి - తన బతుకో ఎడారి చేసింది. నాగేశ్వరిలో నాగుపాముని చూసేడతను. నాగుపాములో విషం వున్నది ఆత్మ రక్షణకే! నాగేశ్వరి విషం స్వార్థానికే స్వసుఖానికే వుపయోగపడింది. అందుకే- తను ఆ మొగలినాగుని ఏడాదిపాటు పస్తులుంచేడు...మరి...ఈమె ఎవరు?

వాస్తవ జీవితంలో ఎన్నో బాధల సుడిగుండాల్లో పడి - కోరికలు తీరే మార్గం లేక-ప్రతీకారం తీర్చుకునే శక్తి లేక పాములో తనని వూహించుకుని- తనలో చెలరేగే క్రౌర్యాన్నిలా కక్కుతోందా?

తన తప్పు ఎంతో ఆమెదీ అంతే! జయరామ్ ఆ భావం రాగానే సిగ్గుతో కుంచించుకుపోయేడు.

* * *

పాము చాలా అందమైనది. సృష్టిలోని అద్భుతాల్లో ఒకటి. పచ్చటి పంటల్ని పాడుచేసే ఎలకల్ని సంహరించి - రైతుకి ఎన్నో రకాలుగా సహాయం చేసే పెన్నిధి. అంత అందానికి కానిని విషపు చుక్కలు ఎంత కళంకం!!!

పాముకే కాదు, మనిషికీ - అంతేగా!

* * *

మొగలినాగుని చూస్తూ "అన్నట్టు - ఆమె పేరేమిటి చెప్మా-అడగనే లేదు!" అనుకున్నాడు జయరామ్.

ఆ తర్వాత ఎన్నో రోజులు ... వారాలు...నెలలు...ఏళ్లు...గడిచేయి. కాని ఆమె తిరిగి రాలేదు!

జయరామ్ ఎప్పుదేనా వీధిలోకి వెళ్తే కాస్త పొడవుగా-సన్నంగా వున్న ప్రతి స్త్రీనీ పరిశీలిస్తాడు. ఆమె ఎక్కడేనా కన్పిస్తే బావుణ్ణు అనుకుంటాడు

కాని, ఆమె మరి రాలేదు !!!

(అంకితం: 'కీ. శే. జాన్ స్టీన్‌బెక్'కి)